మన
ప్రశ్నించడం కోసం...?
RNI NO. TELTEL/2023/90455

# ప్రజా ప్రతినిధి

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలుగు దినపత్రిక

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :288 బుధవారం ఆగష్టు 12 2026, పేజీలు - 4 వేల : 2/-
epaper.manaprajaprathinidhi.com
PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH


## పీవోకేలో ఉద్రిక్తత.. బ్రిటిష్ పౌరుడి మృతి

○నిరసనలపై కాల్పులు.. మరో బ్రిటిష్ వ్యక్తి అరెస్టు
○రెండు నెలలుగా నిర్బంధంలో వకాస్ ఆరిఫ్
○పాకిస్థాన్ అధికారులతో బ్రిటన్ సంప్రదింపులు
○ప్రభావిత ప్రాంతాలకు వెళ్లొద్దని ప్రయాణ హెచ్చరిక




ఆగస్టు 11: పాకిస్థాన్//మనప్రజాప్రతినిధి: ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో కొనసాగుతున్న నిరసనలు అంతర్జాతీయ స్థాయిలో దుమారం రేపుతున్నాయి. ఆర్థిక, ఎన్నికల సంస్కరణల కోసం నిర్వహించిన ఆందోళనల నేపథ్యంలో పాకిస్థాన్ భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో ఓ బ్రిటిష్ పౌరుడు ప్రాణాలు కోల్పోగా, మరో బ్రిటిష్ జాతీయుడిని అరెస్టు చేసి రెండు నెలలుగా నిర్బంధంలో ఉంచిన ఘటన వెలుగులోకి రావడం సంచలనంగా మారింది. ఈ పరిణామాలపై బ్రిటన్ ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ పాకిస్థాన్ అధికారులతో సంప్రదింపులు ప్రారంభించింది. బ్రిటన్‌లోని పీటర్‌బరో నగరానికి చెందిన 50 ఏళ్ల మహ్మద్ అక్తర్ జూన్ 9న కోట్లి నగరంలో జరిగిన నిరసనల సమయంలో భద్రతా బలగాల కాల్పుల్లో మరణించినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. నిరసనల్లో ఆయన ప్రత్యక్షంగా పాల్గొనలేదని, ఇంటి

2


## హైదరాబాద్‌లో సెంట్రికా గ్లోబల్ వ్యాల్యూ సెంటర్ ప్రారంభం



●ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు
●తెలంగాణపై ప్రపంచ సంస్థల విశ్వాసానికి నిదర్శనం
●ఉపాధి అవకాశాలకు కొత్త ఊతం
●సాంకేతికత, ఆవిష్కరణలకు హైదరాబాద్ కేంద్రం

2

## తిరుమలలో భక్తుల వెల్లువ



◆కిటకిటలాడుతున్న తిరుగిరులు
◆సర్వదర్శనానికి 18 గంటల నిరీక్షణ
◆81 వేల మందికి పైగా స్వామివారి దర్శనం
◆హుండీ ఆదాయం రూ.5.36 కోట్లు

2

## అమెరికా ఆంక్షలపై ఇరాన్ మండిపాటు



❑ఆంక్షలు అమెరికాకు వ్యసనంగా మారాయి
❑బెసెంట్ వ్యాఖ్యలకు ఘాటు ప్రతిస్పందన
❑ఆర్థిక యుద్ధాన్ని తట్టుకున్న ఇరాన్
❑సైనిక నాయకత్వంలో కీలక మార్పులు

2

## విద్యార్థులపై లాఠీచార్జ్.. ప్రకాశ్‌రాజ్ ఆగ్రహం



❑'అణచివేతతో సమస్యలు పరిష్కారం కావు'
❑విద్యార్థుల పోరాటానికి సినీ ప్రముఖుల మద్దతు
❑డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమం కొనసాగింపు

2

## మన్మోహన్ సింగ్‌కు సుప్రీంకోర్టు క్లీన్ చిట్



✦తీర్పుపై సోనియా గాంధీ స్పందన
✦'నిజాయతీకి న్యాయం జరిగింది'
✦బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌పై విమర్శలు
✦దర్యాప్తు సంస్థల వినియోగంపై ఆరోపణలు

మనప్రజాప్రతినిధి// న్యూఢిల్లీ, ఆగస్టు 11: బొగ్గు కుంభకోణం కేసులో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సుప్రీంకోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంపై కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ స్పందించారు. భారత రాజకీయ చరిత్రలో ఈ తీర్పు ఒక ముఖ్యమైన మలుపుగా నిలుస్తుందని పేర్కొన్నారు. మన్మోహన్ సింగ్‌ను దేశం అత్యంత ప్రభావశీలమైన, మృదుస్వభావి ప్రధానిగా ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని అన్నారు. ఈ తీర్పుతో భారత రాజకీయాల్లో జరిగిన ఒక విషాదకర అధ్యాయానికి ముగింపు పడిందని సోనియా గాంధీ వ్యాఖ్యానించారు. నిజాయతీ, నైతిక విలువలకు ప్రతీకగా నిలిచిన మన్మోహన్ సింగ్‌ను దోషిగా చూపించేందుకు

2

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ హైఅలర్ట్



❑ఉగ్ర ముప్పుపై నిఘా సంస్థల హెచ్చరిక
❑పాక్, బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కట్టుదిట్టమైన భద్రత
❑'ఆపరేషన్ అలర్ట్' ప్రారంభించిన బీఎస్ఎఫ్
❑దేశవ్యాప్తంగా అప్రమత్తమైన భద్రతా యంత్రాంగం

న్యూఢిల్లీ, ఆగస్టు 11 (మనప్రజాప్రతినిధి): స్వాతంత్ర దినోత్సవ వేడుకల నేపథ్యంలో దేశంలో ఉగ్రవాద దాడుల ముప్పు పొంచి ఉందని నిఘా సంస్థలు హెచ్చరించడంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐ మద్దతుతో ఉగ్రవాద సంస్థలు సరిహద్దుల వద్ద లేదా దేశంలోని ఇతర ప్రాంతాల్లో దాడులకు పాల్పడే అవకాశం ఉందన్న సమాచారంతో భద్రతా బలగాలు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. ముఖ్యంగా పాకిస్థాన్, బంగ్లాదేశ్ సరిహద్దుల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తూ కేంద్రం కీలక చర్యలు చేపట్టింది. ఆగస్టు 15న ఢిల్లీలోని ఎర్రకోటతో పాటు జమ్మూకాశ్మీర్‌లో జరిగే కార్యక్రమాలపై భద్రతా బలగాల దృష్టి కేంద్రీకృతమై ఉంటుందని, ఈ పరిస్థితిని ఆసరాగా

3

## కాలువలో దూకిన ప్రేమ జంట... యువతి మృతి



✦ వేంద్ర వద్ద విషాద ఘటన
✦యువకుడిని కాపాడిన స్థానికులు
✦ కాలువలో లభ్యమైన యువతి మృతదేహం
✦ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

3

# పీవోకేలో ఉద్రిక్తత.. బ్రిటిష్ పౌరుడి మృతి

మెదటి పేజీ తరువాయి




సమీపంలో జరిగిన ఘటనలో తూటా గుండె పక్కన తగలడంతో ప్రాణాలు కోల్పోయారని బంధువులు తెలిపారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేయడానికి కూడా కుటుంబ సభ్యులు భయపడుతున్నారని వారు పేర్కొన్నారు. మరోవైపు, నాటింగ్‌హామ్‌కు చెందిన 38 ఏళ్ల వకాస్ ఆరిఫ్‌ను జూన్ 5న మిర్‌పూర్‌లో అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. తన సోదరుడు నిరసనల్లో పాల్గొనకపోయినా ఇంట్లోకి చొరబడి అరెస్టు చేశారని, ఇప్పటివరకు కోర్టులో కూడా హాజరుపరచలేదని ఆయన సోదరి సుమేరా ఆరోపించారు. ఈ ఘటన మానవ హక్కుల ఉల్లంఘనలపై కొత్త ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఈ రెండు ఘటనలపై బ్రిటన్ విదేశాంగ కార్యాలయం స్పందిస్తూ ఇస్లామాబాద్‌లోని అధికారులతో సంప్రదింపులు కొనసాగిస్తున్నట్లు వెల్లడించింది. మరణించిన వ్యక్తి ఘటనపై పూర్తి నివేదిక కోరడంతో పాటు, నిర్బంధంలో ఉన్న వకాస్ ఆరిఫ్ పరిస్థితిపై వివరాలు తెలుసుకుంటున్నట్లు తెలిపింది. పౌరుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేసింది. పీవోకేలో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారుతున్న నేపథ్యంలో ఆగస్టు 7న బ్రిటన్ ప్రభుత్వం తన ప్రయాణ సూచనలను సవరించింది. నిరసనల ప్రభావం ఉన్న ప్రాంతాలకు వెళ్లవద్దని తమ పౌరులను హెచ్చరించింది. భద్రతా పరిస్థితులు క్షీణిస్తున్నాయని పేర్కొంటూ అత్యవసరమైతే తప్ప ఆ ప్రాంతాలకు ప్రయాణాలు మానుకోవాలని సూచించింది. పీవోకేలో జరుగుతున్న పరిణామాలు ఇప్పుడు అంతర్జాతీయ దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఒకవైపు నిరసనకారులపై బలప్రయోగం, మరోవైపు విదేశీ పౌరుల మృతి, అరెస్టుల ఘటనలు పాకిస్థాన్‌పై ఒత్తిడిని పెంచుతున్నాయి. ఈ వ్యవహారంపై బ్రిటన్ చేపట్టే తదుపరి చర్యలు, పాకిస్థాన్ స్పందనపై ప్రపంచ దేశాల దృష్టి కేంద్రీకృతమైంది.

# హైదరాబాద్‌లో సెంట్రికా గ్లోబల్ వ్యాల్యూ సెంటర్ ప్రారంభం

మెదటి పేజీ తరువాయి




హైదరాబాద్, ఆగస్టు 11 (మనప్రజాప్రతినిధి): హైదరాబాద్‌లో సెంట్రికా, క్లౌడ్ యాంగిల్స్ సంస్థలు ఏర్పాటు చేసిన కొత్త గ్లోబల్ వ్యాల్యూ సెంటర్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థల ప్రతినిధులతో కలిసి కేంద్రాన్ని సందర్శించిన మంత్రి, తెలంగాణలో అంతర్జాతీయ సంస్థల పెట్టుబడులు పెరుగుతుండటం రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు. కొత్త గ్లోబల్ వ్యాల్యూ సెంటర్ ప్రారంభం హైదరాబాద్ అభివృద్ధిలో మరో కీలక మైలురాయిగా నిలుస్తుందని మంత్రి అన్నారు. ప్రతిభ, సాంకేతికత, ఆవిష్కరణలను ఒకే వేదికపైకి తీసుకురావడంలో ఈ కేంద్రం ముఖ్యపాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రపంచ స్థాయి సంస్థలు తెలంగాణను విశ్వసించి తమ కార్యకలాపాలను విస్తరించడం రాష్ట్రానికి ఉన్న అనుకూల వ్యాపార వాతావరణాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. సాంకేతిక రంగంలో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా నిలవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రపంచ సంస్థలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, విధానపరమైన ప్రోత్సాహకాలు, నైపుణ్యంతో కూడిన మానవ వనరులను అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. ఈ కారణంగానే అనేక అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్‌ను తమ విస్తరణ కేంద్రంగా ఎంచుకుంటున్నాయని వివరించారు. ఈ గ్లోబల్ వ్యాల్యూ సెంటర్ ద్వారా రాష్ట్ర యువతకు నాణ్యమైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. సమాచార సాంకేతిక రంగంలో కొత్త ఉద్యోగాలు సృష్టించడంతో పాటు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంలో శిక్షణ, అనుభవం పొందే అవకాశాలు కూడా యువతకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. హైదరాబాద్ ఇప్పటికే ప్రపంచ ఐటీ మ్యాప్‌పై ప్రత్యేక గుర్తింపు సాధించిందని, ఇప్పుడు గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌గా మరింత బలపడుతోందని మంత్రి పేర్కొన్నారు. సెంట్రికా, క్లౌడ్ యాంగిల్స్ వంటి సంస్థల పెట్టుబడులు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, సాంకేతిక రంగ విస్తరణకు దోహదపడతాయని చెప్పారు. సెంట్రికా, క్లౌడ్ యాంగిల్స్ సంస్థల యాజమాన్యానికి మంత్రి అభినందనలు తెలిపారు. ఈ కేంద్రం విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ, తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడూ పెట్టుబడిదారులకు పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్రాన్ని ప్రపంచ సంస్థలకు అత్యంత ప్రాధాన్య గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# తిరుమలలో భక్తుల వెల్లువ

మెదటి పేజీ తరువాయి



మనప్రజాప్రతినిధి//తిరుమల, ఆగస్టు 11: శ్రీవేంకటేశ్వర స్వామివారి దర్శనం కోసం తిరుమలకు భక్తులు భారీగా తరలివస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు, వరుస సెలవులు సమీపిస్తున్న నేపథ్యంలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో తిరుమల కొండలు భక్తజనసందోహంతో కిటకిటలాడుతున్నాయి. ఆలయ పరిసరాలు, ప్రధాన మార్గాలు, తిరుగిరులు అన్నీ భక్తులతో నిండిపోయాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు పూర్తిగా నిండిపోయాయి. వేలాది మంది భక్తులు వెలుపల ఏర్పాటు చేసిన క్యూలైన్లలో వేచి ఉన్నారు. రద్దీ కారణంగా దర్శన సమయం గణనీయంగా పెరిగిందని అధికారులు తెలిపారు. భక్తుల రాక నిరంతరంగా కొనసాగుతుండటంతో క్యూ లైన్లు మరింత పొడవుగా మారుతున్నాయి. ప్రస్తుతం టోకెన్లు లేని సాధారణ భక్తులకు శ్రీవారి సర్వదర్శనం పొందేందుకు సుమారు 18 గంటల సమయం పడుతోందని టీటీడీ అధికారులు వెల్లడించారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని దర్శన ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. భక్తులు ఓర్పుతో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉన్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది. పాలు, తాగునీరు, అన్నప్రసాదాలను నిరంతరం పంపిణీ చేస్తోంది. వైద్య సిబ్బందిని కూడా అప్రమత్తంగా ఉంచి అవసరమైన సేవలను అందిస్తోంది. చిన్నపిల్లలు, వృద్ధులకు ప్రత్యేక సహాయ చర్యలు చేపడుతోంది. ఆగస్టు 10న ఒక్కరోజే 81,064 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వారిలో 33,136 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీ రోజురోజుకూ పెరుగుతుండటం తిరుమల క్షేత్రానికి ఉన్న విశ్వాసానికి నిదర్శనంగా నిలుస్తోంది. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 5.36 కోట్లుగా నమోదైనట్లు టీటీడీ వెల్లడించింది. రద్దీ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని భక్తులందరూ ఆలయ నిబంధనలను పాటించాలని, దర్శన ఏర్పాట్లలో సిబ్బందికి సహకరించాలని అధికారులు కోరారు. రానున్న రోజుల్లో కూడా భక్తుల రాక భారీగా ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

# అమెరికా ఆంక్షలపై ఇరాన్ మండిపాటు

మెదటి పేజీ తరువాయి



బెంగళూరు, ఆగస్టు 2 (మనప్రజాప్రతినిధి): కావేరి నదీ జలాల పంపిణీ సమస్యను సామరస్యపూర్వక చర్చల ద్వారానే పరిష్కరించడమే కర్ణాటక ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారని, అయితే రాష్ట్రంలోని జల పరిస్థితులు మెరుగైన తర్వాత సమావేశం నిర్వహించాలని సూచించినట్లు వెల్లడించారు. రాష్ట్ర జలాశయాల పరివాహక ప్రాంతాల్లో ఇటీవల మంచి వర్షాలు కురుస్తుండటంతో పరిస్థితులు క్రమంగా మెరుగుపడుతున్నాయని సీఎం తెలిపారు. రాష్ట్రంలో తాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగినంత నీటిని నిల్వ ఉంచామని చెప్పారు. కబిని జలాశయం పూర్తిగా నిండిపోవడంతో అదనపు నీరు సహజంగానే దిగువకు ప్రవహిస్తోందని వివరించారు. కావేరి జలాల పంపిణీ విషయంలో రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని శివకుమార్ పేర్కొన్నారు. గతంలో తీవ్ర కరవు పరిస్థితులు ఉన్నప్పటికీ తమిళనాడు 9.9 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కోరిందని, ఆ మేరకు కావేరి జల నిర్వహణ ప్రాధికార సంస్థ సూచనలు చేసినప్పటికీ రాష్ట్ర ప్రయోజనాల కోసం వాటిపై అప్పీల్ దాఖలు చేసినట్లు తెలిపారు. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ రాష్ట్రానికి అన్ని దశల్లో సహకారం అందిస్తున్నారని ముఖ్యమంత్రి కొనియాడారు. కృష్ణా జలాల పంపిణీ, తుంగభద్ర ఆనకట్ట మరమ్మతులు, నవిలె బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం, కృష్ణాగోదావరికావేరి నదుల అనుసంధానం వంటి అంశాల్లో కేంద్రం సానుకూలంగా స్పందించిందని చెప్పారు. కొడుగు ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో ప్రస్తుతం జలాశయాల్లో 57 టీఎంసీలకు పైగా నీరు అందుబాటులో ఉందని సీఎం తెలిపారు. ప్రతిరోజూ 3,500 క్యూసెక్కుల నీటిని కావేరిలో విడుదల చేస్తున్నామని, జలాశయాలు పూర్తిగా నిండిపోవడంతో అదనపు నీరు సహజ ప్రవాహంగా వెళ్తోందని వివరించారు. రాష్ట్రంలో తాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు రైతుల ప్రయోజనాలను కాపాడటానికే ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని డీకే శివకుమార్ స్పష్టం చేశారు. ఇప్పటికే కేఆర్ఎస్, కబిని కాలువలకు సాగునీటిని విడుదల చేసి రైతులు సాగు చేసిన పంటలను రక్షించేందుకు అవసరమైన చర్యలు చేపట్టామని తెలిపారు.

# విద్యార్థులపై లాఠీచార్జ్.. ప్రకాష్‌రాజ్ ఆగ్రహం

మెదటి పేజీ తరువాయి



రాంచీ, ఆగస్టు 11 (మనప్రజాప్రతినిధి): జార్ఖండ్‌లో పోటీ పరీక్షల అవకతవకలు, పేపర్ లీకేజీలకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని ప్రముఖ నటుడు ప్రకాష్‌రాజ్ తీవ్రంగా ఖండించారు. జార్ఖండ్ అసెంబ్లీని ముట్టడించేందుకు ప్రయత్నించిన జేపీఎస్సీ, జేఎస్ఎస్సీ అభ్యర్థులపై పోలీసులు బలప్రయోగం చేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటూ ప్రభుత్వ తీరును ప్రశ్నించారు. పరీక్షల్లో జరిగిన అక్రమాలు, పేపర్ లీకేజీలపై సమగ్ర విచారణ జరిపి కేంద్ర దర్యాప్తు సంస్థతో దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు గత కొంతకాలంగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. సోమవారం సాయంత్రం మూడోసారి శాంతియుతంగా అసెంబ్లీ వైపు మార్చ్ నిర్వహించిన అభ్యర్థులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో లాఠీచార్జ్‌తో పాటు బాష్పవాయువు, నీటి ఫిరంగులను ప్రయోగించి ఆందోళనకారులను చెదరగొట్టారు. ఈ ఘటనపై స్పందించిన ప్రకాష్‌రాజ్ "ఎందుకు.. ఎందుకు.. ఎందుకు? ఈ పాశవిక అణచివేత ఎప్పటికీ పనిచేయదు. ఇది కేవలం అహంకారంతో వ్యవహరించే ప్రభుత్వాన్ని మరింత ఇబ్బందుల్లోకి నెడుతుంది" అంటూ వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తమ సమస్యలను వినిపించేందుకు ప్రయత్నిస్తున్న విద్యార్థులపై బలప్రయోగం చేయడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. జేపీఎస్సీ–జేఎస్ఎస్సీ రిఫార్మ్ మంచ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ ఉద్యమాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ విరమించబోమని విద్యార్థి సంఘాలు స్పష్టం చేశాయి. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, అవకతవకలపై సమగ్ర దర్యాప్తు, బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగుతుందని వెల్లడించాయి. ప్రభుత్వ స్పందన పట్ల అసంతృప్తి వ్యక్తం చేసిన విద్యార్థులు తమ డిమాండ్లు న్యాయమైనవేనని పేర్కొన్నారు. జార్ఖండ్ విద్యార్థుల ఉద్యమానికి దేశవ్యాప్తంగా వివిధ వర్గాల నుంచి మద్దతు లభిస్తోంది. ఇటీవల ప్రముఖ నటుడు, గేయరచయిత పియూష్ మిశ్రా నేరుగా నిరసన ప్రాంతాన్ని సందర్శించి అభ్యర్థులకు సంఘీభావం తెలిపారు. విద్యార్థులు హింసకు దూరంగా శాంతియుతంగా పోరాటం కొనసాగించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన తన ప్రసిద్ధ గీతాన్ని ఆలపించి విద్యార్థుల్లో ఉత్సాహం నింపారు. ప్రముఖ నటి సోనాక్షి సిన్హా కూడా విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు మద్దతు ప్రకటించారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిగణించి త్వరితగతిన పరిష్కరించాలని పలువురు ప్రముఖులు కోరుతున్నారు. జార్ఖండ్‌లో కొనసాగుతున్న ఈ ఉద్యమం ప్రస్తుతం జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది.

# మన్మోహన్ సింగ్‌కు సుప్రీంకోర్టు క్లీన్ చిట్

మెదటి పేజీ తరువాయి



జరిగిన ప్రయత్నాలు పూర్తిగా విఫలమయ్యాయని పేర్కొన్నారు. ఆరోపణలన్నీ నిరాధారమని న్యాయస్థానం తీర్పుతో స్పష్టమైందని చెప్పారు. మన్మోహన్ సింగ్‌కు వ్యతిరేకంగా ఒక వర్గం సమన్వయంతో పనిచేసిందని సోనియా ఆరోపించారు. ఆ సమయంలో వచ్చిన ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమైనవేనని, ఇప్పుడు అవన్నీ అసత్యమని తేలిపోయిందని తెలిపారు. మాజీ ప్రధాని నిర్దోషి అన్న విషయం దేశ ప్రజల ముందుకు వచ్చిందన్నారు. ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను వినియోగించిందని కూడా సోనియా గాంధీ విమర్శించారు. ఈడీ, సీబీఐ వంటి సంస్థల ద్వారా రాజకీయ ఒత్తిళ్లు తీసుకురావడానికి ప్రయత్నించారని ఆరోపించారు. కొందరిని బెదిరించగా, మరికొందరిని రాజకీయంగా బలహీనపరిచేందుకు చర్యలు చేపట్టారని అన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌పై గతంలో చేసిన విమర్శలు, వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని సోనియా గాంధీ పేర్కొన్నారు. పార్లమెంట్ చరిత్రలో కొన్ని వ్యాఖ్యలు అత్యంత దిగజారినవిగా నిలిచిపోతాయని వ్యాఖ్యానిస్తూ, మన్మోహన్ సింగ్ ప్రజాసేవకు చేసిన కృషిని దేశం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని తెలిపారు.

# జాతీయ సగటును మించి ఏపీ వృద్ధి

అమరావతి, ఆగస్టు 11 (మనప్రజాప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధి దిశగా పయనిస్తోందని జూలై 2026 నెలవారీ ఆర్థిక నివేదిక వెల్లడించింది. గత రెండేళ్లుగా జాతీయ వృద్ధి రేటును మించి రాష్ట్ర ఆర్థిక ప్రగతి కొనసాగుతోందని నివేదికలో పేర్కొన్నారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి వాస్తవ వృద్ధి రేటు 2023–24

3

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ హైఅలర్ట్

తరువాయి భాగం




చేసుకుని ఉగ్రవాదులు దాడులకు యత్నించే అవకాశముందని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్, బలూచిస్థాన్‌లో నెలకొన్న అంతర్గత సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇటువంటి కుట్రలకు పాల్పడుతున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. జమ్మూకాశ్మీర్‌లోకి ఉగ్రవాదుల చొరబాట్లు, బంగ్లాదేశ్ సరిహద్దుల ద్వారా అక్రమ ప్రవేశాలు జరగవచ్చని హెచ్చరికలు జారీ అయ్యాయి. అంతేకాకుండా భద్రతా ఏర్పాట్లు తక్కువగా ఉండే ద్వితీయ శ్రేణి నగరాలను లక్ష్యంగా చేసుకునే ప్రమాదం కూడా ఉందని నిఘా సంస్థలు పేర్కొన్నాయి. కొన్నిసార్లు భద్రతా సంస్థల దృష్టిని ఒక ప్రాంతంపై మళ్లించి, మరో ప్రాంతంలో దాడులకు పాల్పడే వ్యూహాన్ని కూడా ఉగ్రవాద సంస్థలు అనుసరించే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో పాకిస్థాన్‌తో ఉన్న పశ్చిమ సరిహద్దు వెంట సరిహద్దు భద్రతా దళం ప్రత్యేక నిఘా చర్యలను ప్రారంభించింది. ఆగస్టు 10 నుంచి 17 వరకు కొనసాగే "ఆపరేషన్ అలర్ట్"లో భాగంగా సరిహద్దు ప్రాంతాల్లో పెట్రోలింగ్, తనిఖీలు, నిఘాను గణనీయంగా పెంచారు. సీనియర్ అధికారులు స్వయంగా పరిస్థితిని పర్యవేక్షిస్తూ ప్రతి అనుమానాస్పద కదలికపై నిశితంగా నిఘా ఉంచుతున్నారు.మరోవైపు బంగ్లాదేశ్ సరిహద్దు వెంబడి కూడా భద్రతను బలోపేతం చేయాలని కేంద్రం నిర్ణయించింది. పశ్చిమ బెంగాల్‌లోని సరిహద్దు జిల్లాల్లో అదనపు నిఘా వ్యవస్థలను ఏర్పాటు చేయడంతో పాటు సుమారు 40 ప్రత్యేక గూఢచార విభాగ యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. సరిహద్దు ప్రాంతాల్లో అక్రమ చొరబాట్లు, స్మగ్లింగ్, అనుమానాస్పద కార్యకలాపాలను అరికట్టడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశంగా అధికారులు చెబుతున్నారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ప్రశాంతంగా, భద్రంగా జరిగేలా కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. కీలక ప్రభుత్వ కార్యాలయాలు, విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, పర్యాటక ప్రాంతాలు, జనసమ్మర్ధ ప్రాంతాల్లో భద్రతను మరింత పెంచాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని భద్రతా సంస్థలు సూచించాయి.

# ఆగస్టు 2 నుండి 18 వరకు అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్ర




మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,చేర్యాల,జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం.కల్లుగీత కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు రెండవ తారీకు నుండి పద్దెనమీదవ తారీకు వరకు అమరుల యాధిలో గీతన్నల చైతన్య బస్సు యాత్ర రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు,ఎం.వి.రమణ,బెల్లంకొండ వెంకటేశ్వర్లు,అన్నారు. మంగళవారం రోజున బస్సు యాత్ర సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం,చుంచనకోట గ్రామం నుండి ప్రారంభమై,చేర్యాల పట్టణం లో జాతీయ రహదారి పై వందలాది మంది కల్లు గీత కార్మికుల తో కలిసి బారి బైక్ ర్యాలీ తీయడం జరిగింది.అనంతరం గాంధీ సెంటర్ వద్ద ర్యాలీ నీ ఉద్దేశించి కేజీ కేఎస్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎం.వి. రమణ,బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ,పెన్షన్ నాలుగు వేలకు పెంచుతామని,ఎక్స్‌గ్రేషియా పది లక్షలు ఇస్తామని అవి కూడా నెల రోజుల లోపే ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో చెప్పారు.కానీ ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదని,రమణ అన్నారు.వృత్తిలో ప్రమాదాలు జరిగిన వారికి ఇవ్వాల్సిన ఎక్స్‌గ్రేషియా ఇరవై కోట్ల రూపాయలు అధికారంలోకి వచ్చి ముప్పై నెలలు దాటినప్పటికీ ఇవ్వలేదని అన్నారు.యాభై సంవత్సరాలు నిండిన వారికి పెన్షన్ ఇవ్వాలని జీవో ఉన్నప్పటికీ కొత్తగా ఎవరి దరఖాస్తులు స్వీకరించడం లేదని అన్నారు.మేము కొత్తగా కోరికలు ఏమి కోరడం లేదని మీరిచ్చిన వాగ్దానాలే అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.వారు మాట్లాడుతూ వృత్తిలో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం కాటమయ్య రక్షణ కవచం ఇస్తుందన్నారు.రాష్ట్రంలో సభ్యత్వం కలిగిన వాళ్లు రెండు లక్షల ముప్పై వేల మంది ఉండగా కేవలం ముప్పై వేల మందికే ఇచ్చారని అన్నారు.వృత్తి చేసే వారందరికీ వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.తాటి ఈత చెట్ల పెంపకానికి ప్రతి సొసైటీకి ఐదు ఎకరాలు చొప్పున భూమి ఇవ్వాలని,నీరా,తాటి,ఈత,ఉత్పత్తుల పరిశ్రమలను ప్రోత్సహించాలని అన్నారు.నందనములోని నీరా ప్రాజెక్టు ను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.బడ్జెట్లో నీరాకు కేటాయించిన ఇరవైఐదు కోట్లు,సంక్షేమాని కి కేటాయించిన అరవై ఏడు కోట్లు వెంటనే విడుదల చేసి ఖర్చు చేయాలన్నారు.గీత కార్మికుల సమస్యలు పరిష్కారం కై ప్రభుత్వం పై ఒత్తిడి పెంచేందుకే ఈ యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. ఆగస్టు 18 వరకు సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ప్రతిష్టించాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో యాత్ర బృందం బూడిదగోపి,బాల్నే వెంకట మల్లయ్య,గౌని వెంకన్న,భీమగోని చంద్రయ్య,పామనుగుళ్ళ అచ్చాలు,కొండం కరుణాకర్,కుర్ర ఉప్పలయ్య,బండకింది బాల్ నారాయణ,మొక్క నాగేశ్వరరావు,బుర్ర సుధాకర్,పాలకూరి జగన్,సురుగు రాజేష్ గౌడ్,హనుమాండ్ల కాడి నవీన్,ఏడవ వార్డు కౌన్సిలర్ పోతుగంటి ప్రసాద్,వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు అనగొని నర్సింహులు,ఆకుల కనకయ్య,కోల సత్తయ్య,గుడాల గణేష్,పచ్చిమడ్ల రాములు,బండకింది క్రాంతి,బండకింది సురేష్,చేర్యాల సొసైటి అధ్యక్షులు పచ్చిమడ్ల సిద్ధిరాములు,మాజి సొసైటీ అధ్యక్షులు అంబాల రాములు,తాళ్లపల్లి నర్సింహులు,వడ్లకొండ సంజీవులు,బూడిద అంజయ్య,వడ్లకొండ వెంకటేష్,బూరుగు సురేష్,పరిశరాములు,కూరెల్ల మల్లేశం,నాచగొని శ్రీనివాస్,వివిధ గ్రామాల సొసైటి అధ్యక్షులు,కల్లు గీత కార్మికులు తదితరులు పాల్గొన్నారు

# అంగన్వాడి కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం




ప్రజాప్రతినిధి న్యూస్ కృష్ణలిఆగస్టు 11 :తిరుపతి జిల్లా అంగన్వాడీ దగ్గరికి వచ్చే పిల్లలను ఆటల పాటలతో వారి తల్లులను మరిపించే విధంగా అంగన్వాడీ టీచర్స్ ఉండాలని తిరుపతి జిల్లా పాకాల మండల విద్యా శాఖాధికారి బాబ్జి అన్నారు. దామల చెరువు ఉన్నత పాఠశాల నందు అంగన్వాడీ కార్యకర్తలకు జరుగుతున్న మూడు రోజుల శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయనపాల్గొన్నారు. ఆయనమాట్లాడుతూ పుట్టిన పిల్లవాడు ఇంటి దగ్గర నుండి మొదటి బయట ప్రపంచం చూసేది అంగన్వాడీ కేంద్రంలో అని పేర్కొన్నారు. వారిని చాలా అపురూపంగా చూసుకున్నప్పుడు వారు ఇంటిని కూడా మరిచిపోతారని అన్నారు.వారికి బొమ్మలు ఇచ్చి వాటి ద్వారా సమాజంలో మనుషులు, జంతువులు వాటితో ఎలా మెలగాలో నేర్పించాలని కోరారు.వారి చేతులు చాలా మృదువుగా, మెత్తగా ఉంటాయి కావున వారికి మౌఖికంగానే నేర్పించాలని పేర్కొన్నారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమతమ్మ, అంగన్వాడీ సూపర్ వైజర్స్ క్రిష్ణ వేణి.కిరణ్మయి, రిసోర్స్ పర్సన్స్ అన్సర్ భాష,వెంకటాద్రి, జోహార్ ,సి. ఆర్.పి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

# కాలువలో దూకిన ప్రేమ జంట... యువతి మృతి

తరువాయి భాగం

పశ్చిమగోదావరి, ఆగస్టు 11 (మనప్రజాప్రతినిధి): పశ్చిమగోదావరి జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. వేంద్ర గ్రామ సమీపంలోని అడవికోడు లాకుల వద్ద కాలువలో దూకిన యువజంటలో యువతి మృతి చెందగా, యువకుడు ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పాలకోడేరు మండలం కుముదవల్లికి చెందిన సందీప్ కుమార్ (22), భీమవరానికి చెందిన లలితాంబిక (20) కొంతకాలంగా పరిచయంలో ఉన్నారు. లలితాంబిక భీమవరంలోని ఓ ఆక్వా దుకాణంలో పనిచేస్తుండగా, సందీప్ తన చదువును కొనసాగిస్తున్నాడు. వీరిద్దరూ వివాహం చేసుకోవాలని నిర్ణయించుకుని కుటుంబ సభ్యులకు విషయం తెలియజేశారు. ఇరువురి కుటుంబ సభ్యులు కూడా వారి వివాహానికి అంగీకరించినట్లు సమాచారం. సందీప్ తన కుటుంబ సభ్యులకు లలితాంబికను పరిచయం చేశాడని, సందీప్ అక్క వివాహం పూర్తైన తర్వాత ఇద్దరి పెళ్లి జరిపిస్తామని పెద్దలు చెప్పినట్లు తెలిసింది. తల్లిదండ్రులు లేని లలితాంబిక తన పెద్దమ్మ వద్ద పెరిగినట్లు సమాచారం.అయితే సోమవారం రాత్రి వేంద్ర గ్రామంలోని అడవికోడు లాకుల వద్దకు చేరుకున్న ఇద్దరూ కాలువలో దూకినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి సందీప్‌ను రక్షించారు. అయితే కాలువలో నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో లలితాంబిక గల్లంతైంది. సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక బృందాలు గాలింపు చర్యలు చేపట్టగా మంగళవారం కాలువలో లలితాంబిక మృతదేహం లభ్యమైంది. ప్రాణాలతో బయటపడిన సందీప్ ప్రస్తుతం భీమవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యుల పర్యవేక్షణలో అతని ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తున్నారు. ప్రాథమిక విచారణలో లలితాంబిక ఆరోగ్య సమస్యల కారణంగా తీవ్ర మనోవేదనకు గురై ఈ నిర్ణయం తీసుకున్నట్లు సందీప్ తెలిపినట్లు సమాచారం. అయితే ఘటనకు గల పూర్తి కారణాలు ఇంకా తెలియాల్సి ఉందని పోలీసులు వెల్లడించారు. కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

# జాతీయ సగటును మించి ఏపీ వృద్ధి

తరువాయి భాగం



ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతంగా ఉండగా, 2025-26 నాటికి 9.9 శాతానికి పెరిగినట్లు వెల్లడైంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు మంగళవారం సీఎం క్యాంపు కార్యాలయంలో ప్రణాళికా విభాగం అధికారులు జూలై నెల ఆర్థిక నివేదికను సమర్పించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, రంగాలవారీగా నమోదైన పురోగతి, భవిష్యత్ లక్ష్యాలపై ఈ సందర్భంగా సమీక్ష నిర్వహించారు.వ్యవసాయం, పారిశ్రామిక రంగం, సేవారంగాల్లో గణనీయమైన వృద్ధి నమోదవుతున్నట్లు నివేదికలో స్పష్టమైంది. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఈ మూడు రంగాలు కీలకంగా నిలుస్తున్నాయని అధికారులు వివరించారు. పెట్టుబడులు, ఉత్పాదకత పెరుగుదల, సేవారంగ విస్తరణ వృద్ధికి దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు పలు సూచనలు చేశారు. ఎల్‌నినో వంటి ప్రకృతి సంబంధిత సవాళ్లు ఎదురైనా రాష్ట్ర ఆర్థిక లక్ష్యాలు దెబ్బతినకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వృద్ధి రేటును మరింత పెంచేందుకు రంగాల వారీగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.రాష్ట్రంలో ఆర్థికాభివృద్ధి ఫలాలు అన్ని వర్గాల ప్రజలకు చేరేలా చర్యలు చేపట్టాలని సీఎం పేర్కొన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగాల్లో ఉపాధి అవకాశాల విస్తరణతో పాటు ఆదాయ వృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్థిక, ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, ప్రణాళికా విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వీఆర్ అలపర్తి, సీఎంఓ అధికారులు రాజమౌళి, ప్రద్యుమ్న తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని మరింత వేగవంతం చేసే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు.

# గ్రామ అభివృద్దే లక్ష్యంగా గ్రామసభ - సర్పంచ్ బంజ లావణ్య రవి




మన ప్రజా ప్రతినిధి నర్సాపూర్ దిన పత్రిక 11: వెల్దుర్తి మండలం శేరిలా గ్రామంలో గ్రామ సమస్యలపై, అభివృద్ధి పనుల గురించి ప్రజలతో మాట్లాడేందుకు శేరిల్లా గ్రామంలో సర్పంచ్ బంజ లావణ్య రవి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు.గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామ పెద్దలు యువకులు అందరూ గ్రామ సమస్యలపై చర్చించారు.ఈ సందర్భంగా సర్పంచ్ బంజ లావణ్య రవి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరికీ అందేలా చూస్తామని,గ్రామం లో ఏ సమస్య ఉన్నా తమ దృష్టి కి తీసుకురావాలని గ్రామ అభివృద్ధికి అందరి సహకారం కావాలని కోరారు. గ్రామస్తులు లేవనెత్తిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బత్తుల నవీన్ , వార్డు సభ్యులు బండ నాగరాజు గోగుల యాదగిరి, అంగన్వాడి టీచర్ దేవలత ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రణీద్ గ్రామ పంచాయతీ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పెద్దలు యువకులు పాల్గొన్నారు.

# శ్రీ వాణి స్కూల్‌లో ఘనంగా పోచమ్మ బోనాలు



మన ప్రజాప్రతినిధి/ మనకొండూరు తేదీ 11 ఆగస్టు :ఇల్లంతకుంటలోని శ్రీ వాణి స్కూల్‌లో మంగళవారం పోచమ్మ బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు, వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. మహిళలు, విద్యార్థులు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.పాఠశాల ఆవరణలో బోనాల పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించేలా కార్యక్రమాలను నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ గణగోని శ్రీకాంత్ ప్రిన్సిపాల్ కొయ్యడ సత్యనారాయణ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు పరిచయం చేయడమే పాఠశాల లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలొ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు శిల్ప, సుష్మ, మౌనిక, స్వర్ణ, రవళి,స్వప్న,రేణుక, బాబు కరుణ,శ్రీలత, శ్రీకాంత్, ఆకాంక్ష, ఇన్షిరా, ప్రతిభ,అనిత, రజిత, కరుణ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## డిఆర్ ఓ కి వినతి పత్రం సమర్పించిన సమాచార హక్కు చట్టం సాధన కమిటీ



మనప్రజాప్రతినిధి//మిర్యాలగూడ ఆగస్టు 10: సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ( ఆర్.టి.ఐ-2005 ) జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్ రాష్ట్ర అధ్యక్షులు సూర స్రవంతి సూచన మేరకు నల్గొండ జిల్లా అధ్యక్షులు సిద్ధం వెంకన్న ఆధ్వర్యంలో డిఆర్ఓ గారైన ఆర్ దశరథ వినతి పత్రం సమర్పించడం జరిగినది జిల్లాస్థాయిలో సమాచార హక్కు చట్టం 2005 సమగ్రంగా అమలు కోసం జిల్లా సమాచార హక్కు చట్టం కమిటీ ఏర్పాటు కోసం జిల్లాస్థాయి మానిటరింగ్ మెంబర్స్ ఏర్పాటు వ్యవస్థ పునరుద్ధరణ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సహాయ కేంద్రం ఏర్పాటు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం సమాచార హక్కు చట్టం సాధన కమిటీకి ప్రాధాన్యత కల్పించడం రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ కి మా సమాచార హక్కు చట్టం సాధన కమిటీని సిఫార్సు చేయవలెనని కోరడం జరిగినది ఈ వినతిపత్రం సమర్పించుటకు కమిటీ సభ్యులైన వైస్ ప్రెసిడెంట్ బైరు రవి సెక్రటరీలు పెరుమాండ్ల లక్ష్మయ్య బండారు జలంధర్ తక్కెళ్ళపల్లి విజయ్ జాయింట్ సెక్రటరీ వెంకటకృష్ణ నాయుడు పాల్గొన్నారు

## చంద్రగిరిలో వైసీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం




ప్రజా ప్రతినిధి న్యూస్ కృష్ణ ఆగస్టు 11 తిరుపతి జిల్లా :చంద్రగిరిలో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మోహిత్ రెడ్డి మాట్లాడుతూలోకేష్ రాజీనామాకు ఆయన సొంత నియోజకవర్గం, సొంత మండలం చంద్రగిరి నుంచే నిరసన గళం పెద్ద ఎత్తున చేపట్టడం జరిగిందన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా యువత, విద్యార్థులు,నిరుద్యోగుల నినాదాలతో హోరెత్తించడం ప్రభుత్వ వ్యతిరేకతకు నిదర్శనం అన్నారు.జగన్ పిలుపుతో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి నాయకత్వంలో జన ప్రవాహంగా చంద్రగిరి మారింది.మేము సైతం అంటూ మోహిత్ రెడ్డి వెంట వేలాదిగా కదం తొక్కారు.డీఎస్సీ2025లో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలపై వేలాది గొంతుకలు ఒక్కటయ్యాయి.ఉద్యోగాల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిరుద్యోగుల ఆశలతో ప్రభుత్వం ఆటలాడుతోందని విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు మండిపడ్డాయి.డీఎస్సీ2025 వ్యవహారంలో నిజాలు రావాలంటే సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని, నిరుద్యోగులకు జరిగిన అన్యాయానికి నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.అవినీతి,అక్రమాలపై ప్రశ్నిస్తే ప్రజల గొంతుకలను అణచివేయాలని చూస్తారా అని చెవిరెడ్డి మోహిత్ రెడ్డిప్రశ్నించారు.ప్రజల గొంతుకలను ఎవ్వరూ ఆపలేరు అని స్పష్టం చేశారు.అర్హత ఉన్న ప్రతి అభ్యర్థికి న్యాయం జరిగే వరకు జగన్ నాయకత్వంలో పోరాటం కొనసాగుతుందని తెలిపారు.నిరుద్యోగుల హక్కుల కోసం, విద్యార్థుల భవిష్యత్తు కోసం, న్యాయం కోసం వైఎస్సార్‌సీపీ పోరాటం నిరంతరం కొనసాగుతుందని చెవిరెడ్డి మోహిత్ రెడ్డి స్పష్టం చేశారు.

# పుస్తకమే నిజమైన ఆయుధం

## - కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు



మన ప్రజాప్రతినిధి నర్సాపూర్ 11: వెల్దుర్తి మండలం రాయరావు సరస్వతి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ప్రథమ సంవత్సరం మరియు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు నోట్ బుక్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ ప్రారంభించారు. ప్రతి విద్యార్థికి 12 నోటు పుస్తకాల చొప్పున అందజేశారు. కాలేజీకి రాణి విద్యార్థులు కూడా కాలేజీకి వచ్చి నోటు బుక్కులు తీసుకోవాలని అన్నారు. పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువుకోవడానికి వారికి ఆటంకం కలగకూడదని ప్రభుత్వం నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమం చేపట్టిందని అన్నారు. ప్రతి విద్యార్థి రోజు కాలేజీకి వచ్చి మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం మరియు నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# మాల మహా వీరులకు నివాళి



మనప్రజాప్రతినిధి// దినపత్రిక మిర్యాలగూడ ఆగస్టు 10: మిర్యాలగూడ పట్టణంలోని, మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు, స్వర్గీయ పివి రావు మాలల హక్కుల కోసం పోరాటం చేసి అసువులు బాసిన మాల అమరవీరులకు ఈరోజు నివాళులు అర్పించడం జరిగింది, అశువులు బాసిన వారిలో కీర్తిశేషులు గోపతోటి నారాయణ, పానంగి శేషయ్య రెడ్డి సత్యనారాయణ సుదర్శన్ ఉద్యమంలో అసువులు బాసిన వారు వీళ్ళందరికీ నివాళులు అర్పిస్తూ వాళ్ల ఆశయాలను కొనసాగిస్తూ ఉద్యమిస్తామన్నారు ఈ కార్యక్రమంలోమాల మహానాడు విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, తాళ్లపల్లి సురేష్ లక్ష్మణ్ అన్న మాల మహానాడు యువజన నాయకులు, కామల్ల మధు, మాల మహానాడు నాయకులు, బైరం సుధాకర్ పాల్గొన్నారు

## సంతాన మల్లికార్జునుడికి అన్నాభిషేకం



మన ప్రజా ప్రతినిధి కొండపాక మండల్ : మర్పడగ గ్రామంలోని శ్రీవిజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామికి మాస శివరాత్రిని పురస్కరించుకొని అన్నాభిషేకం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథ శర్మ పర్యవేక్షణలో గణపతి పూజతో కార్యక్రమం ప్రారంభమయింది. లఘున్యాసపూర్వకంగా సంతాన మల్లికార్జున స్వామికి విశేషంగా పంచామృతాలు ఫలరసాలతో అభిషేకించారు. అనంతరం అన్నపూజ జరిగంది. విజయదుర్గా ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం అన్నప్రసాదవితరణ జరిగింది. కార్యక్రమంలో గట్టు విఠల్, సురేందర్ రెడ్డి, జనార్దన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## కోట ఎస్సీ గురుకుల పాఠశాలవిద్యార్థులకు న్యాయం జరగాలి



తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి డిమాండ్ :ప్రజా ప్రతినిధి న్యూస్ కృష్ణ ఆగస్టు 11 తిరుపతి జిల్లా గూడూరు నియోజకవర్గం కోట పట్టణంలో తిరుపతి,పార్లమెంటు పరిధి, నెల్లూరు జిల్లా కోటలోని డా. బి.ఆర్. అంబేద్కర్ ఎస్సీ గురుకుల పాఠశాల మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి డిమాండ్ చేశారుఆ మేరకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రికి లేఖ రాశారు. గురుకుల పాఠశాలప్రాంగణాన్ని ఐఐటీ-జేఈఈ, నీట్ కోచింగ్ అందించే సెంటర్,ఆఫ్,ఎక్సలెన్స్‌గా మార్చాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి తీవ్రంగా,ఖండించారుఎస్సీవిద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతి కల్పిస్తూ ఎంతోకాలంగా సేవలందిస్తున్న గురుకులపాఠశాలను ఉన్నట్టుండి మూసివేయడం వల్ల వందలాది మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఎంపీ ఆందోళన వ్యక్తం చేశారు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఇలాంటి కీలక నిర్ణయం తీసుకునే ముందువిద్యార్థులు, తల్లిదండ్రులతో చర్చించాల్సిన అవసరంఉందన్నారుఎస్సీవిద్యార్థులకు మెరుగైన విద్య అందించడంతో పాటుఐఐటీ-జేఈఈనీట్ కోచింగ్ వంటి పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వడం స్వాగతించదగ్గ విషయమేనని, అయితే అందుకోసం ఇప్పటికే కొనసాగుతున్న ఎస్సీ గురుకులపాఠశాలను మూసివేయడం సరైన విధానం కాదని ఎంపీ గురుమూర్తి స్పష్టం చేశారుగురుకుల పాఠశాలను యథావిధిగా కొనసాగిస్తూ, అవసరమైతే అదే ప్రాంతంలో ప్రత్యేకంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయాలని ఆయనసూచించారుఎస్సీ విద్యార్థుల విద్యకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రభుత్వం తక్షణమే ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని ఎంపీ మద్దిల గురుమూర్తి డిమాండ్ చేశారు విద్యార్థుల ప్రయోజనాలను, వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కోట ఎస్సీ గురుకుల పాఠశాలను కొనసాగించేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు

## మనుబోలులో ఎస్సీ, ఎస్టీ కాలనీ ఆలయాల అభివృద్ధికి బీజేపీ డిమాండ్



ప్రజా ప్రతినిధి న్యూస్ హరికృష్ణ ఆగస్టు 11:ఉమ్మడి నెల్లూరు జిల్లా మనుబోలు మండలంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఉన్న ఆలయాల అభివృద్ధికి టీటీడీ నిధులుకేటాయించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆలయాలకు మౌలిక వసతులు కల్పించడంతో పాటు, భక్తులకు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు. బీజేపీ ధార్మిక కన్వీనర్ ఆరుమూల మురళి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని కాలనీల్లోని ఆలయాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ బోలా శీను, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులలో విద్యావ్యాప్తి కోసం ఎం వి రావు ఫౌండేషన్ కృషి

### కారిపాటి దెబ్బ గిరిజన కాలనీలో 30 మంది విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ



ప్రజా ప్రతినిధి హరికృష్ణ ఆగస్టు 11 చిట్టమూరు మండలం:మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో నివసించే గిరిజన ప్రాంతాల్లో నివసించే పేద విద్యార్థులలో విద్యా వ్యాప్తి కోసం ఎం వి రావు ఫౌండేషన్ కృషి చేస్తు అని ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎం శ్రీనివాసులు అన్నారు.చిట్టమూరు మండలం ఈశ్వరవాక పంచాయతీ పరిధిలోని కారిపాటి దిబ్బ గిరిజన కాలనీలో ఉన్న ఎం పి పి పాఠశాల, విద్యార్థిని విద్యార్థులకు అవసరమైన నోట్ బుక్స్, పలకలును స్వర్గీయ ముప్పవరపు వెంకటేశ్వరరావు శ్రీమతి ఆదిలక్ష్మి గార్ల జ్ఞాపకార్థం ఎం వి రావు ఫౌండేషన్ 19వ వార్షికోత్సవం పురస్కరించుకుని ఆ ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ కార్యదర్శి ఎం విజయలక్ష్మి చేతుల మీదగా పాఠశాల అంగన్వాడి విద్యార్థిని విద్యార్థులకు పంపిణీ చేశారు.కారం పాటి దిబ్బ గ్రామంలో అందరూ గిరిజనులు నిరుపేదలే. వారికి అవసరమైన నోట్బు, పలకలు లేవని ప్రధానోపాధ్యాయులు ఎంవి రావు ఫౌండేషన్కు తెలియజేయడంతో వారికి అవసరమైన విద్యాసామాగ్రిని అంత ఎం వి రావు ఫౌండేషన్ సౌజన్యంతో అందించడం జరిగింది. అదేవిధంగా ఆ గిరిజన కాలనీలో నివసిస్తున్న నిరుపేదలైన గిరిజన కోసం ఆగస్టు 14వ తేదీ శుక్రవారం గ్రామంలో నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని వారిలో దృష్టిలోపాన్ని నివారించేందుకు ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామని లీలా మోహన్ కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం వి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ, కార్యదర్శి ఎం విజయలక్ష్మి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు ఉపాధ్యాయులు సయ్యద్ సబ్రీన్ గ్రామస్తులు విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ మహంకాళి ఆలయ ఉత్సవాలకు స్థానిక సర్పంచ్ సొంత నిధులు 4,50000 వేలు



ఆగస్ట్ 11 (ప్రజా ప్రతినిధి) చేగుంట :చేగుంట పట్టణ కేంద్రంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీ మహాకాళి దేవాలయం ఉత్సవాలకు చేగుంట సర్పంచ్ స్రవంతి సతీష్,ఆలయ ఉత్సవాలకు 4,50,000 వరకు తన సొంత నిధులు ఖర్చు చేశారు, ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు, అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ ఉసికే శ్రీనివాస్ మాట్లాడుతూ ఆషాడ మాస ఉత్సవాల్లో భాగంగా చేగుంట మండల కేంద్రంలోని శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవాలయ ఉత్సవాలను మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించడం జరిగిందని మూడు రోజులపాటు కొనసాగిన ఉత్సవాలకు సంబంధించి సుమారు నాలుగు లక్షల 50 వేల వరకు స్థానిక సర్పంచ్ స్రవంతి సతీష్ కుటుంబం ఆర్థిక సహకారంతో కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు, ప్రగతి సంవత్సరం సర్పంచ్ కుటుంబం ఇలాంటి సేవా కార్యక్రమాలకు ముందుంటూ ఆర్థిక సహాయ సహకారాలు అందించాలని అమ్మవారి కృపా కటాక్షాలు ఆ కుటుంబం పై ఎల్లవేళలా ఉండాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ తో పాటు సంద్రుగు సతీష్, గడ్డమీది బాలేష్, ఉదయ్ భాస్కర్, సంద్రుగు స్వామి, సిద్ధిరాములు, సత్యనారాయణ, రవి, రఘుపతి, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి హత్య కేసును ఛేదించిన తిరుపతి జిల్లా పోలీసులు
## అంతర్రాష్ట్ర నేరచరిత్ర కలిగిన నలుగురు నిందితుల అరెస్ట్



ప్రజాప్రతినిధి న్యూస్ కృష్ణ ఆగస్టు 11 తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి లో సంచలనం రేకెత్తించిన హత్య కేసును సాంకేతిక ఆధారాలతో ఛేదించిన తిరుపతి జిల్లా పోలీసులు తమిళనాడు రాష్ట్రానికి చెందిన ముగ్గురు, పుత్తూరుకు చెందిన ఒక నిందితుడు అరెస్ట్,వీరందరి పై తమిళనాడు రాష్ట్రంలో గతంలో పలు క్రిమినల్ కేసులు నమోదు వీరందరూ చెన్నై సిటీ కి చెందిన తొప్పాయి గణేశన్ గ్యాంగ్ కు సంబంధించిన వ్యక్తులుగాగుర్తించడమైనది,హత్యకు ఉపయోగించిన యమహా =15 మోటార్సైకిల్, రెండు కత్తులు, రెండు సెల్ఫోన్లు స్వాధీనం పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం ప్రత్యేక పోలీసు బృందాల గాలింపు కొనసాగింపుపీడీ యాక్ట్ నమోదు కు చెర్యలు,కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రత్యేక దర్యాప్తు,బృందాలను ఏర్పాటు చేసి, దర్యాప్తును స్వయంగా పర్యవేక్షించిన తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీఎల్.,సుబ్బరాయుడు,ఐపీఎస్,తిరుపతి ఆగష్టు 11:హత్య ఘటన వివరాలను ఎస్పీ,కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో జిల్లా ఎస్పీ శ్రీ ఎల్ సుబ్బరాయుడు ఐపిఎస్., గారు వెల్లడించారు02-08-2026 రాత్రి సుమారు 7:30 గంటల సమయంలో శ్రీకాళహస్తి పట్టణంలోని పి ఆర్ గెస్ట్,హౌస్,సమీపంలోని స్వర్ణముఖి నది కట్టపై శ్రీకాళహస్తికి చెందిన మగలంపాటి శివకుమార్ శివను గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో తలపై, శరీరంపై దాడి చేసి హత్య చేసిన ఘటనపై శ్రీకాళహస్తి 1 టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.శ్రీకాళహస్తి వంటి ప్రముఖ,పుణ్యక్షేత్రంలో జరిగిన ఈ ఘటనను అత్యంత ప్రాధాన్యతతో పరిగణించిన తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీ,ఎల్.,సుబ్బరాయుడు., ఐపీఎస్,కేసును ప్రత్యేకంగా అదనపు ఎస్పీ ఎల్ అండ్ ఓ శ్రీరవి,మనోహరాచారి పర్యవేక్షణలో శ్రీకాళహస్తి డీఎస్పీ శ్రీ కె. నరసింహమూర్తి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి 1 టౌన్, 2 టౌన్, రూరల్, బి.ఎన్. కండ్రిగ పోలీసు అధికారులతో ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశారు.ప్రత్యేక దర్యాప్తు బృందాలు వివిధ సాంకేతిక ఆధారాలను సేకరించివాటిని విశ్లేషించి ముద్దాయిలు (1) వి . కార్తీక్, (2) వి . గోపీనాథ్ గుండు గోపి, (3) బి . శ్రీధర్ ఏ రెడ్డి అను వార్లు శ్రీకాళహస్తికి వచ్చి శివకుమార్ ను కత్తులతో నరికి చంపినట్లుగా, మరియు (4) ఎం . సూర్య అను వ్యక్తి మరియు (5) తమిళనాడు రాష్ట్రంకు చెందిన మరొక ముద్దాయి (అబ్స్కండింగ్ ) శివకుమార్ ను చంపడానికి అవసరమైన మోటార్ సైకిల్ మరియు కత్తులను సమకూర్చినట్లు దర్యాప్తులో తెలిసినది. పుత్తూరుకు చెందిన మునస్వామిసూర్య మరియు తమిళనాడు రాష్ట్రానికి చెందిన మరో నిందితుడు హత్యకు అవసరమైన కత్తులను, మోటార్ సైకిల్ ను సమకూర్చడంలో సహకరించినట్లు గుర్తించారు.హత్యకు దారితీసిన,పరిస్థితులుతమిళనాడు పోలీసులకు కావలసిన నేరస్థుడు (మోస్ట్ వాంటెడ్ అక్యూస్డ్ ) తొప్పాయి గణేషన్ కు, చంపబడిన శివకుమార్ శివ శ్రీకాళహస్తి లో ఆశ్రయంకల్పించినాడని, ఆ తరువాత గణేశన్ 16.03.2026వ తేదీన చెన్నైలో పోలీస్ కాల్పులలో మరణించినాడని, అందుకు శివకుమార్ చెన్నై పోలీసు వారికి సమాచారం ఇచ్చినందు వల్లనే, తమిళనాడు పోలీస్ కాల్పులలో చనిపోయాడని అనుమానంతో కక్ష పెంచుకొని, అరెస్టు కాబడినముద్దాయిలు ప్రతీకార చర్యగా శివకుమార ను హత్య చేయడం జరిగినది. అరెస్ట్ వివరాలుదర్యాప్తులో లభించిన ఆధారాల మేరకు నలుగురు నిందితులను ఈ దినము అనగా 11.08.2026న అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన యమహా ఆర్ 15 మోటార్సైకిల్, రెండు కత్తులు, రెండు సెల్ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన నిందితుల వివరాలువెంకటేషన్ కార్తీక్, వయస్సు 32 సంవత్సరాలు, తండ్రి: పెద్ద గోవిందు వెంకటేషన్, తాలవేడు గ్రామం, తిరుత్తణి తాలూకా, తిరువళ్లూరు జిల్లా, తమిళనాడు. ఇతనిపై,తమిళనాడు రాష్ట్రంలో 4 పాత కేసులు ఉన్నట్లు దర్యాప్తులో గుర్తించారువేలు గోపీనాథ్ గుండు గోపి, వయస్సు 27 సంవత్సరాలు, తండ్రి: వేలు, పడి గ్రామం, అంబలత్తూరు తాలూకా, తిరువళ్లూరు జిల్లా, తమిళనాడు. ఇతనిపై,తమిళనాడు రాష్ట్రంలో 25 పాత కేసులు ఉన్నట్లు దర్యాప్తులో గుర్తించారుబి. శ్రీధర్ ఏ రెడ్, వయస్సు 26 సంవత్సరాలు, తండ్రి: భాస్కర్, ఎడపాల్యం గ్రామం, ఆలమతి పోస్ట్, పొన్నేరి తాలూకా, తిరువళ్లూరు జిల్లా, తమిళనాడు. ఇతనిపై,తమిళనాడు రాష్ట్రంలో 4 పాత కేసులు ఉన్నట్లు దర్యాప్తులో గుర్తించారు. మునస్వామి సూర్య, వయస్సు 19 సంవత్సరాలు, తండ్రి: మునస్వామి, గాంధీనగర్, పుత్తూరు టౌన్, తిరుపతి జిల్లా, ఇతనిపై,తమిళనాడు రాష్ట్రంలో 2 పాత కేసులు ఉన్నట్లు దర్యాప్తులో గుర్తించారు. ఈ కేసులో పరారీలో ఉన్న మరో నిందితుడిని అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. ఈ సంచలనాత్మక హత్య కేసును సాంకేతిక ఆధారాలను సమర్థవంతంగా వినియోగిస్తూ వేగంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన అదనపు ఎస్పీ ( ఎల్ అండ్ ఓ ) శ్రీ రవి మనోహరాచారి, శ్రీకాళహస్తి డీఎస్పీ శ్రీ కె. నరసింహమూర్తి, మరియు వారి సబ్ డివిజన్ సీసఫ్ సిస్ మరియు వారి సిబ్బందిని జిల్లా ఎస్పీఅభినందించారు. పై అరెస్టు కాబడిన,ముద్దాయిలపై పీడీ యాక్ట్ నమోదుకు చర్యలు చేపట్టడం జరుగుతుంది. నేరచరిత్ర కలిగిన వ్యక్తుల కదలికలపై నిరంతర నిఘా, సాంకేతిక ఆధారాల వినియోగంతో, దర్యాప్తు కొనసాగిస్తూ, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని జిల్లా పోలీసులు స్పష్టం చేశారు

# కాకాణితో నేదురుమల్లి భేటీ



ప్రజా ప్రతినిధి న్యూస్ కృష్ణ ఆగస్టు 11 ఉమ్మడి నెల్లూరు జిల్లా :వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కాకాణి గోవర్ధన్ రెడ్డి ని వెంకటగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ నేదురుమల్లి రామ్కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారుపలు అంశాలపై చర్చించిన కాకాణి, నేదురుమల్లి:ఈ సందర్భంగా పార్టీకి సంబంధించిన పలు అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. బూదూరు గురవయ్య పరిచయ కార్యక్రమానికి ఆహ్వానం గూడూరు నియోజకవర్గం, చిలకూరు మండల కన్వీనర్ యద్దల మధుసూదన్ రెడ్డి వేమారెడ్డి కుమారస్వామి రెడ్డి కాకాణి గోవర్ధన్ రెడ్డి, నేదురుమల్లి రామ్కుమార్ రెడ్డిలను కలిసి ,గూడూరు నియోజకవర్గానికి నూతనంగా నియమితులైన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బూదూరు గురవయ్య పరిచయ కార్యక్రమాన్ని ఈ నెల 14వ తేదీన చిలకూరు మండలం మోమిడి గ్రామంలో నిర్వహించనున్నందున హాజరుకావాలని ,ఆహ్వానించారు తప్పకహాజరవుతాం:కాకాణి, నేదురుమల్లి మోమిడి గ్రామంలో నిర్వహించనున్న బూదూరు గురవయ్య పరిచయ కార్యక్రమానికి తాము తప్పక హాజరవుతామని ఈ సందర్భంగా కాకాణి గోవర్ధన్ రెడ్డి, నేదురుమల్లి రామ్కుమార్ రెడ్డిలు తెలిపారు.

# నిజమైన తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి న్యాయం చేయాలి





మనప్రజాప్రతినిధి //దుబ్బాక తెలంగాణ ఉద్యమకారులు పూదూరి శ్రీనివాస్, గుడ్ల శివమల్లేశం. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన నిజమైన ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి వారికి తగిన న్యాయం చేయాలని దుబ్బాక నియోజకవర్గం అక్బర్ పేట్ భూంపల్లి మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారులు డిమాండ్ చేశారు. మంగళవారం మల్లుపల్లి ఉద్యమకారుడు పూదూరి శ్రీనివాస్, మరియు ఆల్మస్ పూర్ ఉద్యమకారుడు గుడ్ల శివమల్లేశం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమంలో వేలాది మంది విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, రైతులు, కార్మికులు,కవులు కళాకారులు, మహిళలు పాల్గొని రాష్ట్ర సాధన కోసం ఎన్నో త్యాగాలు చేశారని గుర్తు చేశారు. ఉద్యమ సమయంలో కేసులు ఎదుర్కొన్నవారు, జైలు శిక్ష అనుభవించినవారు, తమ విద్యా, ఉద్యోగ అవకాశాలను కోల్పోయినవారు నేడు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనిఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమంలో పాల్గొన్న అనేక మంది ప్రస్తుతం పేదరికంలో జీవిస్తుండగా, ఉద్యమంతో సంబంధం లేని వారు ప్రయోజనాలు పొందారని పేర్కొన్నారు. గ్రామీణ స్థాయిలో ఉద్యమాన్ని ముందుకు నడిపించిన కార్యకర్తలను గుర్తించి వారికి ప్రత్యేక గుర్తింపు,మరియు ఇరవై ఐదువేల రూపాయలు ఫింఛన్,హైదరాబాద్ ప్రాంతంలో రెండు వందల యాబై గజాల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణం,ఉపాధి అవకాశాలు, సంక్షేమ పథకాలు కల్పించాలని కోరారు. తెలంగాణ ఉద్యమం కుల, మత, రాజకీయాలకు అతీతంగా సాగిందని, సబ్బండ వర్గాల ప్రజల ఐక్య పోరాట ఫలితంగానే రాష్ట్రం ఏర్పడిందని పేర్కొన్నారు. ఉద్యమంలో అమరులైన వారి త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాల సాధన కోసం ఉద్యమకారులందరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు చేసిన నేపథ్యంలో, ఉద్యమకారుల వివరాలను సేకరించి సమగ్ర నివేదికను కమిటీకి అందించాలని సూచించారు. ఉద్యమకారులను అందరినీ ఒకే వేదికపైకి తీసుకురావాలని తెలిపారు. ఉద్యమకారులందరికి న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత అన్ని పార్టీల రాజకీయ నాయకులపై ఉందన్నారు.

# రైతులకు అవగాహన సదస్సు ప్రకృతి వ్యవసాయం చేయాలని



కంది మండలం రిపోర్టర్ ఆగష్టు 11(మన ప్రజాప్రతినిధి ):మంగళవారం రోజు ఎర్ధనూర్ గ్రామంలో సర్పంచ్ పంబాల జ్యోతి దుర్గా ప్రసాద్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించడం జరిగింది . ఈ సమావేశంలో పలు గ్రామ సమస్యలలు ప్రజలు సర్పంచ్ దృష్టికి తేవడంతో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ సమావేశంలో వ్యవసాయ మండల అధికారులు ఏఓ ఆసియా బబేగం, ఏఈ సునీల్ పాల్గొని గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేయాలని, అధిక దిగుబడులు వచ్చే పంటలకే ప్రాధాన్యం ఇవ్వాలని, ఏలినో ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకొని రైతులు ప్రత్యామ్నాయ పంటలో వైపు ముగ్గు చూపాలని సూచించడం జరిగింది.

# రైతులతో మాట – పంట మార్పిడికి బాట
# మగ్రికుంట తండాలో అవగాహన సదస్సు



తిరుమలగిరి మండల(మన ప్రజాప్రతినిధి) పరిధిలోని మగ్రికుంట తండా గ్రామంలో "రైతులతో మాట – పంట మార్పిడికి బాట" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బానోతు రోజాలక్ష్మణ్ నాయక్ మరియు రెవెన్యూ డిపార్ట్మెంట్ అధికారిణి సుభద్ర రైతులకు పంట మార్పిడి విధానంపై, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృత అవగాహన కల్పించారు భూసారాన్ని రక్షించుకోవాలి ఈ సందర్భంగా రెవెన్యూ అధికారి సుభద్ర మాట్లాడుతూ.. రైతులు ఒకే రకమైన వరి పంటను సాగు చేసి నష్టపోవద్దని సూచించారు. వరికి బదులుగా మినుములు, కందులు, మొక్కజొన్న, పెసర, నువ్వులు, వేరుశెనగ, కూరగాయలు వంటి ఆరుతడి పంటలు వేయడం వల్ల తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయన్నారు. పంట మార్పిడి ద్వారా భూసారం పెరిగి, తెగుళ్ల ఉధృతి తగ్గుతుందని రైతులకు వివరించారు.అర్హులందరికీ సంక్షేమ పథకాలుగ్రామ సర్పంచ్ బానోతు రోజా లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నేతృత్వంలోని ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని రకాల సంక్షేమ పథకాలు గ్రామాల్లోని అర్హులైన ప్రతి ఒక్క రైతుకు, కుటుంబానికి అందుతాయని స్పష్టం చేశారురైతులు ప్రభుత్వ రాయితీలను, వ్యవసాయ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారుఎమ్మెల్యే మందుల సామేలు గారికి కృతజ్ఞతలుఈ సదస్సులో ప్రజాప్రతినిధులు మరియు అధికారులు స్థానిక శాసనసభ్యులు మందుల సామేలుగారి పనితీరును ప్రత్యేకంగా కొనియాడారు. నియోజకవర్గ అభివృద్ధికి, ముఖ్యంగా రైతాంగ సంక్షేమానికి ఎమ్మెల్యే గారు నిరంతరం శ్రమిస్తున్నారని ప్రశంసించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా వారు చేస్తున్న కృషి అభినందనీయమంటూ సభలో కొనియాడారుఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ సంధ్య శ్రీనివాస్, వార్డు సభ్యులు సునీత యాకుబ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు భాస్కర్ నాయక్, గ్రామ కార్యదర్శి కిరణ్, ఇరిగేషన్ డిపార్ట్మెంట్ నరేష్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు బాజు, ఉపాధి హామీ సిబ్బంది ధరవత్ శ్రీనివాస్, గ్రామ పెద్దలు, స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# శ్రీ కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు



నేరేడుచర్ల మన ప్రజాప్రతినిధి దినపత్రిక ):నేరేడుచర్ల లోని శ్రీ కోదండ రామాలయంలో మంగళవారం శ్రీ రాముడి జన్మ నక్షత్రమైన పునర్వసు నక్షత్రం సందర్భంగా అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు, ఆలయ పూజారి కొలచిన దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు ఆవు పాలు, ఆవు నెయ్యి, పంచదార,గంధం, తేనె వివిధ రకాల పండ్ల రసాలతో వేదమంత్రాలతో సాంప్రదాయ సిద్ధంగా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక అభిషేకాలు, నీరాజనం మంత్రపుష్పం ప్రత్యేకపూజా కార్యక్రమాలను చేశారు, మంగళవారం ఆంజనేయ స్వామికి అభిషేకాలు, పునర్వసు నక్షత్ర పూజా కార్యక్రమాలు నిర్వహించగా ఆలయం భక్తులతో కిటకిటలాడింది అయినాల ప్రసాద్, లత దంపతుల సహకారంతో భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు, ఈ పూజా కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్త రాచకొండ నాగ మాధవరావు, పులిజాల వెంకటరమణరావు, చింతకుంట్ల పూర్ణచంద్రారెడ్డి, ఉప్పల కృపాకర్, పొనుగోటి జంగారావు, చింతకుంట్ల శ్రీనివాసరావు, భువనగిరి అంజయ్య, నిమ్మగడ్డ సుబ్బారావు, కొప్పు లక్ష్మీనారాయణ గౌడ్, తాటికొండ నర్సిరెడ్డి, కిషోర్, కాంపల్లి నారాయణరెడ్డి, జిన్నారెడ్డి వీరారెడ్డి, కృష్ణారెడ్డి, గజవెల్లి వెంకటేశ్వర్లు,అనంతులసత్యనారాయణ, వెంకట్ రెడ్డి, భరత్ తదితరులు పాల్గొన్నారు

# సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు విజయవంతం కట్టా వెంకటరమణారెడ్డి వెల్లడి...



మన ప్రజా ప్రతినిధి న్యూస్ ప్రతినిధి కృష్ణ ఆగస్టు 11 తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం:విజయవంతంగా సూపర్ సిక్స్ పథకాల అమలుపేదల అండగా తెలుగుదేశం పార్టీ టిడిపి నేత కట్టా వెంకటరమణారెడ్డి కూటమి ప్రభుత్వ పాలనలో సూపర్ సిక్స్ ఎన్నికల హామీలను విజయవంతంగా అమలు చేసిన తెలుగుదేశం పార్టీ పేద ప్రజలకు అండగా ఉంటుందని తెలుగుదేశం పార్టీ నాయకులు యూనిట్ ఇన్చార్జ్ కట్టా,వెంకటరమణారెడ్డి తెలియజేశారు. మంగళవారం తిరుపతి జిల్లా నాయుడుపేట మండలంలోని గొట్టిప్రోలు,పంచాయతీ తన్నమల గ్రామంలో తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న రెండేళ్ల నమ్మకం,అభివృద్ధి సంక్షేమం కార్యక్రమంలో భాగంగా ఇంటింట ప్రచార కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా టిడిపి నేత కట్టా వెంకటరమణారెడ్డి స్థానిక నాయకులతో కలిసి తన్నమల గ్రామంలో పర్యటించారు.రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి,కార్యక్రమాల వివరాలను తెలియజేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడం తోపాటు అభివృద్ధి,సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని కొనియాడారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,రాష్ట్ర మంత్రి నారా లోకేష్ లసహకారంతో,ఎమ్మెల్యే మాజీ ఎంపీ నెలవలసుబ్రహ్మణ్యం ప్రోత్సాహంతో వందల కోట్ల రూపాయలతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలియజేశారు.అలాగే అర్హత గల ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పాలన సాగిస్తూ ప్రజల మన్ననలు అందుకుంటున్నారని తెలిపారు. ప్రజలు తెలుగుదేశం పార్టీని ఆశీర్వదించి జరగనున్న స్థానిక ఎన్నికల్లో ఘన విజయం అందించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో బి ఎల్ ఏ పిట్ల నాగేంద్ర, పలువురుతెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక

మన ప్రజా ప్రతినిధి కొండపాక: మండల కేంద్రంలో గౌడ సంఘం నూతన కార్యవర్గం మంగళవారం రోజు కొండపాక మండల కేంద్రంలో ఎక్సైజ్ అధికారి, కోఆపరేటివ్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో టీటీసీస్ (గౌడ సొసైటీ) గౌడ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది.నూతన కార్యవర్గంలో అధ్యక్షులుగా అంబటి రాజు గౌడ్,ఉపాధ్యక్షులుగా అంబటి బాలచంద్రం గౌడ్,డైరెక్టర్లుగా మారబోయిన రాములు గౌడ్,నాగిల్ల పరశురాములు గౌడ్,అంబటి కిషన్ గౌడ్‌లు కొండపాక గౌడ సంఘం నూతన కార్యవర్గం సభ్యులు గా ఎన్నిక కావడం జరిగింది.



# హర్ ఘర్ పర్ తిరంగా జండా ఎగరవెయ్యాలి మొలుగు నాగేందర్ రెడ్డి



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా మసాయిపేట్ /చేగుంట ఆగస్ట్ 11:మాసాయిపేట మండలంలో ఘనంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం పై మండల కేంద్రంలో మండల ఇన్‌చార్జ్ వంటేరు శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన, మండల బీజేపీ అధ్యక్షులు మొలుగు నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంపై మండల స్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా మండల ఇన్‌చార్జ్ వంటేరు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశంలోని ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి, దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా మాసాయిపేట మండలంలోని ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి భారతదేశంపై గౌరవాన్ని మరింత పెంచాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నవీన్ యాదవ్, మండల ఉపాధ్యక్షులు శ్రీకాంత్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు ఆకారం బాబు, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షులు లింగం నాయక్, యువమోర్చా మండల అధ్యక్షులు గోగొండ విట్టల్, హకీంపేట ఉపసర్పంచ్ వెంకటేష్ చారి, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ రాము నాయక్, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి ముక్కా యాదగిరి, సీనియర్ నాయకులు బాబు, బూత్ అధ్యక్షులు ఏశం కుమార్ యాదవ్, శ్రీనివాస్ నాయక్, రవి, అశోక్ తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు మహేందర్, రమేష్ నాయక్, చందు, స్వామి, శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# చట్టసభల్లో బీసీలకు ప్రాతినిధ్యం కల్పించాలి



మిర్యాలగూడ : మనప్రజా ప్రతినిధి దినపత్రిక ):చట్ట సభల్లో బీసీలకు ప్రాతినిధ్య చట్టం వచ్చేవరకు మడమతిప్పని పోరాటం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం నాడు నల్లగొండ జిల్లా మిర్యాలగూడ బీసీ భవన్ లో విడుదల చేసిన పత్రికా ప్రకటనలో... ఇప్పుడు దేశవ్యాప్తంగా అస్తిత్వ ఉద్యమాలు విస్తృతంగా జరుగుతున్నాయని ముఖ్యంగా చట్టసభల్లో 50% రిజర్వేషన్ కావాలని స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కోసం బీసీలు వివిధ రూపాల్లో తీవ్రమైన ఆందోళన జరిపిన నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టి కేంద్రానికి పంపితే తొమ్మిదో షెడ్యూల్లో పెట్టాల్సిన బిల్లుకు ఇంతవరకు అతిగతి లేదని ఇప్పుడు బీసీలు చేసే పోరాటం జీవనోపాధికి సంబంధించినది కాదని రాజ్యాధికారంలో భాగం కోసం... దేశ జనాభాలో 50% బాగా ఉన్న బీసీలు చేసే పోరాటశీ ఇధి అని ఇది కేవలం ఆర్థిక అంశాలకు సంబంధించిన ప్రశ్న కాదని ఇది ఈ దేశంలోని బీసీల అస్తిత్వ, ఆత్మగౌరవానికి దేశంలో అన్ని రంగాలలో ప్రాతినిధ్యం కోసం డిమాండ్ చేసే ప్రశ్న అని, మన దేశంలో గౌరవం అనేది కులంతో ముడిపడి ఉండటం బాధాకరమని కులానికి అధికారం తోడైతే ఆ గౌరవం మరింత పెరుగుతుందని ఈ దేశంలో ఇప్పుడున్న సామాజిక ఆర్థిక వ్యవస్థ పూర్తిగా వివక్షతతో వెలివేతలతో కూడుకొని ఉన్నదని అణచివేయబడిన బలహీన వర్గాల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్నదని ఇలాంటి అణగదొక్కబడిన సామాజికంగా వెనుకబడిన వారిని వ్యవస్థలో ఇప్పటికే బాగా అభివృద్ధి చెంది ముందు వరుసలో ఉన్న వారితో పోటీ పడాలని చెప్పడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు అందువల్ల రాజకీయ రిజర్వేషన్లు అవ్వలేదు జనాభా దాబాషా ప్రకారం ఏ కుల జనాభా ఎంత ఉందో ఆయా కులాల వారికి అంతే దామాషా పద్ధతుల్లో చట్టసభల్లో స్థానిక సంస్థలలో విద్యా,ఉద్యోగ, ఉపాధి రంగాలలో రిజర్వేషన్ కల్పిస్తే అందరికీ స్వాతంత్ర ఫలాలు దక్కుతాయని తద్వారా దేశం వేగవంతంగా అభివృద్ధి చెందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు

# విద్యార్థిపై దాడి ఘటనపై బాలల హక్కుల కమిషన్ సీరియస్



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్:శ్రీ చైతన్య పాఠశాల భద్రతా లోపాలపై ఆరా.. సీసీ కెమెరాలు లేకపోవడంపై ఆగ్రహం.మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా దమ్మాయిగూడలోని శ్రీ చైతన్య పాఠశాలలో ఓ విద్యార్థిపై తోటి విద్యార్థులు దాడి చేసిన ఘటనపై తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ తీవ్రస్థాయిలో స్పందించింది. విద్యార్థుల భద్రత విషయంలో పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించిందా? భద్రతా నిబంధనలు ఎందుకు పాటించలేదు? అనే అంశాలపై కమిషన్ సీరియస్‌గా ఆరా తీసింది.ఈ ఘటనపై తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు గోగుల సరిత సంబంధిత అధికారులతో మాట్లాడి పూర్తి వివరాలను తెలుసుకున్నారు.అలాగే జవహర్‌నగర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సైదులుతో మాట్లాడి ఘటనకు సంబంధించిన పరిస్థితులు, ఇప్పటివరకు తీసుకున్న చర్యలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.సుమారు 600 మంది విద్యార్థులు చదువుతున్న శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థుల భద్రత కోసం తగిన సీసీ కెమెరాల వ్యవస్థ లేకపోవడంపై కమిషన్ తీవ్రంగా స్పందించినట్లు తెలిసింది. ఇంత పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉన్న విద్యాసంస్థలో భద్రతా ఏర్పాట్ల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని స్పష్టం చేసింది.విద్యార్థులపై దాడులు, వేధింపులు లేదా ఇతర అవాంఛనీయ ఘటనలు జరిగినప్పుడు వాస్తవ పరిస్థితులను గుర్తించేందుకు,బాధ్యులను గుర్తించేందుకు సీసీ కెమెరాలు కీలకంగా ఉంటాయని పేర్కొంటూ, పాఠశాలలో భద్రతా ఏర్పాట్లపై సమగ్రంగా పరిశీలన చేయాల్సిన అవసరం ఉందని సూచించింది.ఈ నేపథ్యంలో మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా డీఈవో తక్షణమే ఈ వ్యవహారంపై దృష్టి సారించి, దమ్మాయిగూడ శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థుల భద్రతా ప్రమాణాలు, సీసీ కెమెరాల ఏర్పాటు, పాఠశాల యాజమాన్యం అనుసరిస్తున్న నిబంధనలు తదితర అంశాలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు.విచారణలో పాఠశాల యాజమాన్యం నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సూచించింది. విద్యార్థుల భద్రత విషయంలో పాఠశాల యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదనే స్పష్టమైన సందేశాన్ని ఈ ఘటన ద్వారా కమిషన్ ఇచ్చినట్లయింది.

# మహిళా కౌన్సిలర్ల ఆధ్వర్యంలో ఆషాడ మాస సంబరాలు



నేరేడుచర్ల,:(-మనప్రజాప్రతినిధి దినపత్రిక ):నేరేడుచర్ల మున్సిపాలిటీలో పరిధి లోని 4,8,14వ వార్డ్ మహిళా కౌన్సిలర్లు కొణతం మంజుల వెంకటరెడ్డి, తాళ్ల లావణ్య సురేష్ రెడ్డి, సరికొప్పుల విజయలక్ష్మి నాగేశ్వరరావు కోఆప్షన్ సభ్యురాలు పొనుగోటి శోభ జంగారావు ఆధ్వర్యంలో ఆషాడ మాస గోరింటాకు పండుగ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళలందరూ కలిసి ఒకే చోట గోరింటాకును కార్యక్రమాన్ని ప్రారంభించి మహిళలతో కలిసి సంప్రదాయ సిద్ధంగా ఒకరి చేతులకు ఒకరు గోరింటాకు పెట్టుకున్నారు.అనంతరం కౌన్సిలర్ల మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రతి సంవత్సరం ఆషాడ మాసంలో గోరింటాకు పండుగను జరుపుకోవడం తెలంగాణ సంస్కృతి మహిళలకు సాంప్రదాయమన్నారు. గోరింటాకు పెట్టుకోవడం ఆరోగ్యానికి మంచిదని సూచించారు. సాంప్రదాయాలను కొనసాగించే బాధ్యత ప్రతి మహిళపై ఉందన్నారు.ఆషాడమాసం గోరింటాకు పండగ మహిళలకు చాలా ఉపయోగకరం సంతోషకరమైనది మహిళలు కోరారు.ఈ కార్యక్రమంలో మహిళలు తడకమల్ల అరుణ, నంద్యాల జీవిత రెడ్డి, తాళ్ల విజిత, పద్మ, మౌనిక, శిరీష, పూజ, బైరెడ్డి కవిత,ఏమిరెడ్డి శోభ,తదితరులు మహిళలు పాల్గొన్నారు.

# ఆరో వార్డు కౌన్సిలర్... జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక మిర్యాలగూడ ఆగస్టు10: మిర్యాలగూడ మున్సిపాలిటీ గడిచిన పది సంవత్సరాల్లో ఎన్నడూ లేని విధంగా ఆరో వార్డు ఇందిరమ్మ కాలనీలో వచ్చిన ఐదు నెలల లోపు గత పది సంవత్సరాల అభివృద్ధిని చూపించిన ఆరోవ వార్డు కౌన్సిలర్ ఆడోత్ అశోక్ జన్మదిన వేడుకలు మొట్టమొదటిసారిగా ఇందిరమ్మ కాలనీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు యువకులు అభిమానుల మధ్య 300 మందితో అభిమానానికి హద్దు లేకుండా ఆనందోత్సవాలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్ మిర్యాలగూడ మండల అధ్యక్షులు నరేందర్ గౌడ్ 1వ పట్టణ అధ్యక్షులు కోడి రెక్క ఇంద్ర 17 వ వార్డు కౌన్సిలర్ నూకల కవిత వేణుగోపాల్ రెడ్డి కౌన్సిలర్ బూడిద సైదులు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# ఘనంగా పోచమ్మ తల్లికి బోనాల జాతర



మన ప్రజాప్రతినిధి తెలుగు దినపత్రిక ఆగస్టు 11/అల్లాదుర్గంమండల పరిధిలోని గడి పెద్దాపూర్ గ్రామంలో మంగళవారం ఆషాడ మాసం సందర్భంగా పోచమ్మ దేవతకు ఘనంగా బోనాల జాతర నిర్వహించారు. గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా మంగళ హారతులు, డప్పు వాయిదాలతో గ్రామ పుర వీధుల గుండా పోచమ్మ ఆలయానికి బయలుదేరి వెళ్లారు. దారి పొడవునా మేళ తాళాలతో పోతురాజు విన్యాసాలతో బోనాల ఊరేగింపు కోలాహలంగా సాగింది. అనంతరం మహిళలు బోనాలతో ఆలయం చుట్టూ ఐదు ప్రదక్షిణలు చేసి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు బచ్చు రమేష్ గుప్త, విట్టల్ రెడ్డి, గ్రామ పెద్దలు రాజు గౌడ్, వెంకటేశం, సాయిలు తదితరులున్నారు.